# యడేశ్వరి దేవి యాత్రకు పోటెత్తిన భక్తులు

- 40 కి.మీ ట్రాఫిక్ జామ్ • సోలాపూర్-ధూలే హైవేపై నిలిచిపోయిన వాహనాలు




**ప్రజానావ, ముంబై:** మహారాష్ట్రలోని ధారాశివ్ జిల్లాలో యడేశ్వరి దేవి యాత్ర సందర్భంగా భక్తుల తాకిడి విపరీతంగా పెరిగి, సోలాపూర్-ధూలే హైవేపై సుమారు 40 కిలోమీటర్ల మేర భారీ ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. మరాఠ్వాడా కులస్వామినిగా ప్రసిద్ధి చెందిన యడేశ్వరి దేవి దర్శనం కోసం 1.5 లక్షలకు పైగా భక్తులు తరలివచ్చిన నేపథ్యంలో, పరిస్థితి నియంత్రణలోకి తీసుకురావడంలో అధికార యంత్రాంగం ఇబ్బందులు ఎదుర్కొంటోంది. ప్రతి సంవత్సరం చైత్ర మాసంలో నిర్వహించే ఈ యాత్ర ఈసారి మార్చి 30 నుంచి ఏప్రిల్ 7 వరకు కొనసాగుతోంది. చైత్ర పౌర్ణమి సందర్భంగా జరిగే పల్లకీ ఊరేగింపులో పాల్గొనడానికి మహారాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు పెద్ద ఎత్తున ధారాశివ్‌కు చేరుకున్నారు. భారీ జనసందోహం కారణంగా సోలాపూర్--ధూలే ప్రధాన రహదారిపై వాహనాలు కిలోమీటర్ల మేర నిలిచిపోయాయి. డ్రోన్ కెమెరాల్లో ఈ ట్రాఫిక్ తీవ్రత స్పష్టంగా కనిపిస్తుండగా, వాహనాలు చీమలు పాకుతున్నట్లుగా నెమ్మదిగా కదులుతున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. మండుటెండల మధ్య గంటల తరబడి ట్రాఫిక్‌లో చిక్కుకుపోయిన భక్తులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ ట్రాఫిక్ జామ్ సామాన్య ప్రజలతో పాటు పలువురు వీఐపీలను కూడా ప్రభావితం చేసింది. సమాచారం ప్రకారం, ఓ బీజేపీ నాయకుడు కూడా ఈ జామ్‌లో సుమారు రెండున్నర గంటల పాటు నిలిచిపోయారు. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు పోలీసులు, అధికారులు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టినప్పటికీ, భక్తుల భారీ రద్దీ కారణంగా ట్రాఫిక్‌ను పూర్తిగా క్లియర్ చేయడానికి సమయం పడుతోంది. ఈ మార్గంలో ప్రయాణించే వారు జాగ్రత్తలు పాటించాలని, ప్రత్యామ్నాయ మార్గాలను వినియోగించాలని అధికారులు సూచించారు. పల్లకీ ఉత్సవం నేపథ్యంలో రద్దీ మరింత పెరిగే అవకాశం ఉండటంతో, ట్రాఫిక్ సమస్యను పరిష్కరించడం అధికారులకు సవాల్‌గా మారింది.

# పెట్టుబడుల పేరిట రూ.2.09 కోట్ల మోసం

- అంతర్జాతీయ సైబర్ ముఠా అరెస్ట్ • నవీ ముంబై సైబర్ పోలీసుల దాడిలో పట్టుబడ్డ ముగ్గురు నిందితులు
- రూ.62 లక్షలు స్వాధీనం • భారీ పరికరాలు, నకిలీ డాక్యుమెంట్లు జప్తు

**ప్రజానావ, ముంబై:** షేర్ మార్కెట్, ఐపీఓల్లో పెట్టుబడి పెడితే భారీ లాభాలు వస్తాయని నమ్మించి రూ.2.09 కోట్లకు పైగా మోసం చేసిన అంతర్జాతీయ సైబర్ ముఠాను నవీ ముంబై సైబర్ పోలీసులు ఛేదించారు. ఈ ఆపరేషన్‌లో ముగ్గురు నిందితులను అరెస్టు చేసి, కీలక వివరాలను వెలికితీశారు. అరెస్టు అయిన వారిలో ఇద్దరు గతంలో బ్యాంకాక్, మయన్మార్‌లలోని కుప్రసిద్ధ సైబర్ మోసాల కాల్‌సెంటర్లలో పనిచేసినట్లు విచారణలో తేలింది. ప్లేస్‌మెంట్, ఇంటర్న్‌షిప్ సంస్థ యజమానిని లక్ష్యంగా చేసుకుని స్టాక్ మార్కెట్ పెట్టుబడులపై అధిక రాబడులు ఇస్తామని ఆశపెట్టి, వివిధ కారణాలతో రూ.2,09,30,537 వసూలు చేసినట్లు పోలీసులు తెలిపారు. డబ్బులు తిరిగి రాకపోవడంతో బాధితుడు నవీ ముంబై సైబర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, దర్యాప్తు ప్రారంభించారు. విచారణలో అర్షిల్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ పేరిట సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో ఉన్న అనుమానాస్పద ఖాతాను గుర్తించారు. సాంకేతిక విశ్లేషణ ఆధారంగా తుర్భే ప్రాంతానికి చెందిన సుశీల్ భగవాన్ జువత్కర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తన సహచరులు పంకజ్ రాజ్ కపూర్, నిశ్చల్ ట్యాంక్‌బీర్ బరేలీ సూచనల మేరకు ఈ ఖాతా తెరిచినట్లు అతను ఒప్పుకున్నాడు. తదుపరి విచారణలో పంకజ్ కపూర్, నిశ్చల్ బరేలీలు బ్యాంకాక్, మయన్మార్‌లలో సైబర్ కాల్‌సెంటర్లు నిర్వహించిన అనుభవం కలిగి ఉండి, నవీ ముంబైలో కొత్తగా కాల్‌సెంటర్ ప్రారంభించేందుకు ప్రయత్నిస్తున్నట్లు వెల్లడైంది.




నిందితుల నుంచి పోలీసులు 6 మొబైల్ ఫోన్లు, 2 ల్యాప్‌టాప్‌లు, 3 పాస్‌పోర్ట్‌లు, 3 పీఓఎస్ మెషీన్లు, వివిధ బ్యాంకులకు చెందిన 24 ఖాతా కిట్లు, 12 నకిలీ స్టాంపులు, 2 హార్డ్‌డిస్క్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో సుశీల్ భగవాన్ జువత్కర్, పంకజ్ రాజ్ కపూర్, నిశ్చల్ ట్యాంక్‌బీర్ బరేలీ అనే ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. దర్యాప్తులో భాగంగా బాధితుడికి చెందిన రూ.62 లక్షలను వివిధ బ్యాంకు ఖాతాల నుంచి స్వాధీనం చేసుకోవడంలో పోలీసులు విజయవంతమయ్యారు. పోలీస్ సబ్-ఇన్‌స్పెక్టర్ ప్రకాష్ కట్కడే ఆధ్వర్యంలో బృందం ఈ కేసులో మరింత లోతైన దర్యాప్తు కొనసాగిస్తోంది.



## పోరాట స్ఫూర్తికి ప్రతీక దొడ్డి కొమురయ్య

**ప్రజానావ, సిరిసిల్ల :** పోరాట స్ఫూర్తికి ప్రతీక దొడ్డి కొమురయ్య అని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ పేర్కొన్నారు. దొడ్డి కొమురయ్య జయంతి వేడుకలను జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో శుక్రవారం నిర్వహించగా, అదనపు కలెక్టర్ హాజరై దొడ్డి కొమురయ్య చిత్రపటానికి అధికారులతో కలిసి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ మాట్లాడుతూ దొడ్డి కొమురయ్య పోరాట స్ఫూర్తిని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి సౌజన్య, ఉద్యానవన శాఖ జిల్లా అధికారి శరత్, ఎగుట్ల కనకయ్య, నాగం కుమార్ అధికారులు పాల్గొన్నారు.

# భీవండిలో హనుమాన్ జయంతి వేడుకలు

- తెలుగు సేవా మండళ్ల ఆధ్వర్యంలో వైభవంగా ఉత్సవాలు • శోభాయాత్రలు, ప్రత్యేక పూజలు, అన్నదానాల సందడి



**ప్రజానావ, ముంబై:** మహారాష్ట్రలో తెలుగు ప్రజలు అధికంగా నివసించే భీవండిలో పటణంలోని వాడవాడల్లో హనుమాన్ జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించబడ్డాయి. స్థానిక తెలుగు సేవా మండళ్ల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, శోభాయాత్రలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తూ భక్తి వాతావరణం నెలకొల్పారు. హనుమాన్ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో వంద మంది భక్తులు హనుమాన్ దీక్ష తీసుకోగా, దాతల సహకారంతో 41 రోజుల పాటు భిక్షా కార్యక్రమం నిర్వహించారు. శుక్రవారం ఈ దీక్షను స్వాములు విరమించారు. పద్మనగర్‌లో ఏర్పాటు చేసిన 56 అడుగుల అభయ ఆంజనేయ స్వామి విగ్రహానికి పాలాభిషేకం నిర్వహించి, మహాపూజలు, హోమాలు, మహా హారతులు ఘనంగా చేపట్టారు. ఈ సందర్భంగా నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో వేలాది మంది భక్తులు పాల్గొన్నట్లు ట్రస్ట్ ప్రతినిధులు తెలిపారు. అమృత్‌చాల్‌లోని హనుమాన్ మందిరాన్ని విద్యుద్దీపాలు, పూలతో అలంకరించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం జరిగిన అన్నదానంలో సుమారు మూడు వేల మంది పాల్గొన్నారు. అలాగే పల్లకీ ఊరేగింపు భక్తులను ఆకట్టుకుంది. వరాలదేవి మందిరం ప్రాంగణంలోని పంచముఖి హనుమాన్ భక్త బృందం ఆధ్వర్యంలో మహా పూజలు, హోమాలు, సామూహిక జపాలు నిర్వహించారు. అనంతరం జరిగిన అన్నదానంలో సుమారు 8 వేల మంది భక్తులు పాల్గొన్నారు. సాయంత్రం పల్లకీ ఊరేగింపు కన్నులపండువగా సాగింది. పద్మనగర్‌లోని మార్కండేయ మిత్ర మండల్ నేతృత్వంలో గత తొమ్మిదేళ్లుగా జరుగుతున్న హనుమాన్ జయంతి వేడుకలు ఈసారి కూడా వైభవంగా నిర్వహించారు. ధర్మాచాల్-రాజుచాల్ సంయుక్తంగా ఆలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నదాన కార్యక్రమంలో సుమారు నాలుగు వేల మంది పాల్గొన్నారు. నారాయణ్ కాంపౌండ్‌లోని హనుమాన్ మందిరంలో కూడా ప్రత్యేక పూజలు నిర్వహించి, అన్నదానంలో సుమారు 4వేల మంది భక్తులు పాల్గొన్నారు. సాయంత్రం పద్మనగర్ వీధుల్లో హనుమాన్ పల్లకీ, రామలక్ష్మణ, హనుమాన్ వేషధారణలతో రథాలపై శోభాయాత్రలు నిర్వహించారు. మేళతాళాల మధ్య సాగిన ఈ ఊరేగింపులో భక్తులు, చిన్నారులు రామనామం జపిస్తూ నృత్యాలు చేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. స్వామివారి దర్శనం కోసం భక్తులు భారీగా తరలివచ్చి కానుకలు సమర్పించారు.

# మారనున్న గుడి చెరువు రూపురేఖలు

- మురుగు నీటి మళ్లింపునకు యుద్ధ ప్రాతిపదికన పైపులైన్ పనులు
- పట్టణ సుందరీకరణే లక్ష్యం
- గుడి చెరువు పనులను పరిశీలించిన మున్సిపల్ చైర్మన్



**ప్రజానావ, వేములవాడ:** వేములవాడ మున్సిపాలిటీని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దే క్రమంలో పట్టణాభివృద్ధిపై పాలకవర్గం ప్రత్యేక దృష్టి సారిస్తోంది. ముఖ్యంగా రాజన్న క్షేత్రానికి వచ్చే భక్తులకు ఆహ్లాదాన్ని పంచేలా గుడి చెరువు అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయి. పట్టణంలోని మురికి నీరు చెరువులోకి చేరకుండా ఉండేందుకు, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఆదేశాల మేరకు గుడి చెరువు నుండి మూల వాగు వరకు అండర్‌గ్రౌండ్ పైపులైన్ నిర్మాణ పనులు చేపట్టారు. ఈ పనులను మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పవిత్రమైన గుడి చెరువు కలుషితం కాకుండా చూడటం తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఎమ్మెల్యే చొరవతో భారీ నిధులు కేటాయించి డ్రైనేజీ మళ్లింపు పనులు చేపట్టామని తెలిపారు. పనులు పూర్తయిన తర్వాత గుడి చెరువు పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందుతుందని, పట్టణ సుందరీకరణలో ఇది కీలక పాత్ర పోషిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. అలాగే వార్డుల వారీగా సమస్యలను పరిష్కరించడంతో పాటు పట్టణంలోని ముఖ్య ప్రాంతాలను ఆధునీకరిస్తున్నామని వివరించారు. ఈ తనిఖీలో వైస్ చైర్మన్ నరాల శేఖర్, 17వ వార్డు కౌన్సిలర్ ముత్యం, మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# 'సెస్' వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సేవలే లక్ష్యం

- సమీక్ష సమావేశంలో డివిజన్ ఇంజనీర్ అంజయ్య

**ప్రజానావ, సిరిసిల్ల :** సిరిసిల్ల సహకార విద్యుత్ సరఫరా (సెస్) వినియోగదారులకు నాణ్యమైన, నిరంతర విద్యుత్ సేవలు అందించడం సంస్థ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ముఖ్యంగా వేసవి కాలంలో లోడ్ పెరుగుదలను దృష్టిలో ఉంచుకుని ముందస్తు చర్యలు చేపట్టాలని సిరిసిల్ల డివిజన్ ఇంజనీర్ అంజయ్య సూచించారు. ఎస్‌ఈ బి. బిక్షపతి ఆదేశాల మేరకు గంభీరావుపేట మండలంలోని ముస్తాబాద్ సెక్షన్ కార్యాలయంలో శుక్రవారం విద్యుత్ ఉద్యోగులు, ఓ అండ్ ఎం సిబ్బందితో వేసవి కార్యాచరణ, వ్యవసాయ సర్వీసుల మంజూరు, విద్యుత్ భద్రతపై సిరిసిల్ల డివిజన్ ఇంజనీర్ అంజయ్య సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అంజయ్య మాట్లాడుతూ ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యాన్ని పెంచడం, ప్రమాదభరితంగా ఉన్న లైన్లను గుర్తించి మరమ్మతులు చేయడం, వంగిన విద్యుత్ స్థంభాలను తక్షణమే మార్చడం వంటి చర్యలను వేగవంతం చేయాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో పనులు నిర్వహించే ప్రతి ఉద్యోగి భద్రతా నిబంధనలు కచ్చితంగా పాటించాలని, హెల్మెట్, హ్యాండ్ గ్లౌజ్, ఎర్త్ రాడ్ వంటి భద్రతా పరికరాలు లేకుండా ఎట్టి పరిస్థితుల్లోనూ పనులు చేయరాదని స్పష్టం చేశారు. అలాగే గ్రామీణ వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు (ఏజీఎల్) పెండింగ్‌లో ఉన్న సేవలను త్వరితగతిన విడుదల చేయడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గంభీరావుపేట ఏడిఈ శ్రీనివాస్ , ఏఈ విష్ణు తేజ, ఓ అండ్ ఎం సిబ్బంది ఇతర అధికారులు పాల్గొన్నారు.





# టెస్కో యూనిఫాం ఆర్డర్ల రద్దు

- చేనేత కార్మికులకు భారీ దెబ్బ
- ప్రభుత్వ నిర్ణయంపై పవర్‌లూమ్ వర్కర్స్ యూనియన్ ఆగ్రహం
- టెండర్ విధానం రద్దు చేసి ఆర్డర్లు పునరుద్ధరించాలని డిమాండ్

**ప్రజానావ, సిరిసిల్ల :** 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి టెస్కోకు ఇచ్చిన ఏకరూప దుస్తుల ఆర్డర్లను అకస్మాత్తుగా రద్దు చేయడం ప్రభుత్వ దుర్మార్గపు చర్య అని పవర్‌లూమ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేష్ ఆరోపించారు. ఈ నిర్ణయం వల్ల చేనేత, పవర్‌లూమ్ కార్మికుల జీవనోపాధిపై తీవ్ర ప్రభావం పడుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో రమేష్ మాట్లాడుతూ, విద్యాశాఖ ముఖ్యమంత్రి ఆధీనంలో ఉన్నప్పటికీ కమిషన్ల కోసం టెండర్ల ద్వారా ఈ ఆర్డర్లను ప్రైవేట్ సంస్థలకు ఇవ్వడం అనైతికమని విమర్శించారు. సిరిసిల్లలో ఆర్‌వీఎం క్లాత్ ఉత్పత్తి చేయాలని ప్రభుత్వం ముందుగా ఆదేశాలు ఇచ్చి, దాదాపు రూ.50 కోట్ల విలువైన నూలు కొనుగోలు చేసి ఉత్పత్తి ప్రారంభించిన సమయంలోనే ఆర్డర్లను రద్దు చేయడం కార్మికులకు తీవ్రమైన నష్టం కలిగిస్తుందని పేర్కొన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో పవర్‌లూమ్, చేనేత కార్మికుల పరిస్థితి దయనీయంగా మారిందని, యుద్ధ పరిస్థితుల ప్రభావంతో అన్ని వస్తువుల ధరలు పెరిగి పరిశ్రమ సంక్షోభంలోకి వెళ్లిందన్నారు. ఇలాంటి సమయంలో ప్రభుత్వ నిర్ణయం వస్త్ర పరిశ్రమను మరింత వెనక్కు నెడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా సంక్షేమం తమ అజెండా అని చెప్పుకునే ప్రభుత్వం ఇలాంటి నిర్ణయాలు తీసుకోవడం సరైన విధానం కాదని ప్రశ్నించారు. పవర్‌లూమ్, చేనేత కార్మికులకు సంవత్సరంలో 365 రోజులు ఉపాధి కల్పించాల్సిన బాధ్యతను ప్రభుత్వం విస్మరిస్తోందని విమర్శించారు. అన్ని ప్రభుత్వ రంగ సంస్థలకు అవసరమైన వస్త్రాలను చేనేత, పవర్‌లూమ్ కార్మికుల ద్వారానే ఉత్పత్తి చేయించాలని, టెండర్ విధానాన్ని వెంటనే రద్దు చేసి టెస్కోకు విద్యాశాఖ నుంచి యూనిఫాం ఆర్డర్లను పునరుద్ధరిస్తూ జీఓ జారీ చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కోడం రమణ, జిల్లా నాయకులు సిరిమల్ల సత్యం, ఒగ్గు గణేష్, నక్క దేవదాస్, సందుపట్ల సత్యం తదితరులు పాల్గొన్నారు.

# రచయిత్రి స్వర్ణ కిలారికి గూడూరి పురస్కారం




**ప్రజానావ, సిరిసిల్ల:** మారసం అధ్యక్షులు, ప్రముఖ తెలంగాణ కథా రచయిత గూడూరి సీతారాం స్మారకంగా గూడూరి ఫౌండేషన్ మారసం కథా పురస్కారం ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. 2024 సంవత్సరానికి గాను రచయిత్రి, అనువాదకురాలు స్వర్ణ కిలారి రచించిన "నల్ల బంగారం" కథల పుస్తకాన్ని ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. శుక్రవారం మారసం కార్యదర్శి ఆడెపు లక్ష్మణ్, గూడూరి ఫౌండేషన్ ప్రతినిధి ఎలగొండ రవి ఈ విషయాన్ని వెల్లడించారు. ఏప్రిల్ 5, 2026 ఆదివారం సిరిసిల్ల జిల్లా గ్రంథాలయంలోని డా. సినారే విజ్ఞాన మందిరంలో నిర్వహించే సభలో ఈ పురస్కారాన్ని ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి చైర్‌పర్సన్ జిందం కళా చక్రపాణి ముఖ్య అతిథిగా హాజరుకానుండగా, డా. నలిమేల భాస్కర్, జుకంటి జగన్నాథం ముఖ్య అతిథులుగా పాల్గొననున్నారు. గెంట్యాల భూమేష్ సభకు అధ్యక్షత వహించనుండగా, గూడూరి సీతారాం కుమారులు గూడూరి వేణు, మారసం వ్యవస్థాపకులు డా. పత్తిపాక మోహన్ కూడా పాల్గొననున్నారు. తెలంగాణ జీవితాలు, ముఖ్యంగా బొగ్గుబాయి కార్మికుల జీవన విధానాన్ని ప్రతిబింబించే కథల సమాహారంగా "నల్ల బంగారం" పుస్తకం నిలిచిందని నిర్వాహకులు పేర్కొన్నారు. గతంలో ఈ పురస్కారాన్ని పూదూరి రాజిరెడ్డి, డా. సూర్య ధనంజయ్, పిన్నమశెట్టి కిషన్ అందుకున్నారని తెలిపారు.



## సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

**ప్రజానావ, వేములవాడ:** వేములవాడ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అర్హులైన 60 మంది లబ్ధిదారులకు 23 లక్షల 64 వేల రూపాయలు విలువ గల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని తెలిపారు. ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా అనేక మంది పేద కుటుంబాలకు ఉపశమనం కలుగుతుందని చెప్పారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఈ పథకం ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.



## సారపాకలో దొంగల బీభత్సం

**ప్రజానావ, ఖమ్మం:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం సారపాక గ్రామంలో దొంగలు వరుస దొంగతనాలతో ప్రజలను భయాందోళనలకు గురిచేస్తున్నారు. కేవలం పది రోజుల వ్యవధిలోనే రెండుసార్లు దొంగలు గ్రామంపై పడి నగదు, ఆభరణాలు, వాహనాలతో పాటు చివరికి పబ్లిక్ టాయిలెట్లలోని ఇనుప సామాగ్రిని కూడా వదలకుండా ఎత్తుకెళ్లారు. గత నెల మార్చి 23వ తేదీన పుట్టి రాజు అనే వ్యక్తి కుటుంబ సభ్యులు ఇంట్లో లేని సమయంలో బీరువా తాళాలు పగలగొట్టి నగదు, నగలను దోచుకెళ్లిన దుండగులు, అదే రోజు పోట్రూ అనిల్ అనే వ్యక్తికి చెందిన బైకును కూడా దొంగిలించారు. తాజాగా గురువారం అర్ధరాత్రి మేడే కాలనీలో దొంగలు మరోసారి పంజా విసిరారు. ప్రగతి స్కూల్ ఎదురు సందులో నివాసం ఉంటున్న జక్కుల కిషన్ కుటుంబ సభ్యులు ఇంట్లో లేని సమయాన్ని ఆసరాగా చేసుకుని వారి ఇంట్లోకి చొరబడి 20 వేల రూపాయల నగదుతో పాటు విలువైన వస్తువులను అపహరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. క్లూస్ టీమ్ సహాయంతో వేలిముద్రలను సేకరించి నిందితుల కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. ఇదిలా ఉండగా, గ్రామంలోని పబ్లిక్ టాయిలెట్లలో ఉన్న వాష్ బేసిన్ ట్యాపులు, ఇతర ఇనుప పనిముట్లను కూడా దొంగలు ఎత్తుకెళ్లడం స్థానికంగా పెద్ద చర్చనీయాంశంగా మారింది. నిత్యం జనసంచారం ఉండే కాలనీల్లో కూడా దొంగతనాలు జరుగుతుండడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి సమయాల్లో పోలీసు పెట్రోలింగ్‌ను మరింత పెంచాలని గ్రామస్థులు కోరుతున్నారు. ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని, ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే సమాచారం అందించాలని పోలీసులు సూచించారు.

## గిరిజన ఉత్పత్తులపై అధ్యయనం

**ప్రజానావ, భద్రాచలం:** ఐటీడీఏ ద్వారా అమలువుతున్న వివిధ సంక్షేమ పథకాలు, గిరిజన మహిళల స్వయం ఉపాధి యూనిట్లను గ్రూప్ వన్ శిక్షణా డిప్యూటీ కలెక్టర్లు శుక్రవారం సందర్శించారు. తమ శిక్షణలో భాగంగా క్షేత్రస్థాయి పరిశీలనకు వచ్చిన వారు, ముందుగా ఎంఎస్ఎం ఈ యూనిట్ పరిధిలో గిరిజన మహిళలు తయారు చేస్తున్న సబ్బులు, షాంపూల తయారీ విధానాన్ని అడిగి తెలుసుకున్నారు.

## దుర్గాభవాని నగర్ నీటి సమస్యలపై అధికారుల పర్యటన

**ప్రజానావ, ఫిలింనగర్:** దుర్గాభవాని నగర్ బస్తీలో తక్కువ ఒత్తిడితో నీటి సరఫరా, వీధుల్లో మురుగు నీరు పొంగిపొర్లుతున్న సమస్యలపై ఎమ్మెల్యే దానం నాగేందర్ ఆదేశాల మేరకు శుక్రవారం హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ అధికారులు పర్యటించారు. ఫిలింనగర్ ఇన్‌చార్జ్ మేనేజర్ అభిషేక్, వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, లైన్ మెన్‌లు చంటి, సాయి బస్తీని సందర్శించి పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఫిలింనగర్ 18 బస్తీల సంక్షేమ సంఘం అధ్యక్షుడు మామిడి నర్సింగ్ రావు పాల్గొని, బస్తీ ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. తక్కువ ఒత్తిడితో నీటి సరఫరా జరుగుతోందని, కాలువలు పొంగిపొర్లుతున్నాయని స్థానికులు వివరించారు. పరిశీలన అనంతరం అధికారులు కొన్ని వీధుల్లో కొత్త నీటి పైపులు వేయాల్సిన అవసరం ఉందని గుర్తించారు. అదేవిధంగా దుర్గాభవాని నగర్‌కు అదనంగా ఒక బూస్టర్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. నీటి మోటార్ల వినియోగాన్ని నివారించాలని ప్రజలకు సూచించారు. ఒక వారంలో అంచనా వ్యయం సిద్ధం చేసి బడ్జెట్ ఆమోదానికి పంపిస్తామని అధికారులు తెలిపారు. వేసవి కాలంలో నీటి సమస్యలను పరిష్కరించేందుకు ఎమ్మెల్యే దానం ఏసీడీఎఫ్ నిధుల నుంచి నిధులు కేటాయించేందుకు సిద్ధంగా ఉన్నారని మామిడి నర్సింగ్ రావు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో బస్తీ నాయకులు యెల్లయ్య, జగన్, మురళి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



# సంక్షోభంలో భీవండి పవర్‌లూమ్ పరిశ్రమ

- యుద్ధ ప్రభావంతో నూలు ధరలు 30% పెరుగుదల
- ఉత్పత్తిదారులకు భారీ నష్టాలు
- గుడ్డ ధరలు పెరగకపోవడంతో కర్మాగారాలు మూతపడే పరిస్థితి
- లక్షలాది కార్మికుల ఉపాధిపై ముప్పు


**ప్రజానావ, ముంబై:** ఒకప్పుడు "మాంచెస్టర్ ఆఫ్ ఇండియా"గా పేరుగాంచిన మహారాష్ట్రలోని భీవండి పవర్‌లూమ్ పరిశ్రమ ప్రస్తుతం తీవ్రమైన సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. ఇరాన్, ఇజ్రాయెల్, అమెరికా మధ్య కొనసాగుతున్న యుద్ధ ప్రభావంతో నూలు, ముఖ్యంగా పాలిస్టర్ యార్న్ ధరలు సుమారు 30 శాతం పెరిగాయి. అయితే, తయారైన గుడ్డ ధరలు పెరగకపోవడంతో ఉత్పత్తిదారులు వాటిని ఖర్చుకంటే తక్కువ ధరకే అమ్మాల్సిన పరిస్థితి ఏర్పడింది. కొనుగోలుదారుల సంఖ్య కూడా గణనీయంగా తగ్గిపోవడంతో మగ్గాల యజమానులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితి కొనసాగితే కర్మాగారాలను మూసివేసి యంత్రాలను తుక్కులో అమ్ముకోవాల్సిన పరిస్థితి వస్తుందని వారు హెచ్చరిస్తున్నారు. భీవండి పట్టణంలో చిన్నా పెద్ద కుటీర పరిశ్రమలు అన్నీ పవర్‌లూమ్ రంగంపైనే ఆధారపడి ఉండటంతో, ఈ సంక్షోభం వాటిపై కూడా తీవ్ర ప్రభావం చూపుతోంది. శాంతి నగర్ పవర్‌లూమ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మన్నన్ సిద్ధిఖీ మాట్లాడుతూ, భివండీ ఆసియాలోనే అతిపెద్ద పవర్‌లూమ్ కేంద్రంగా నిలిచిందన్నారు. పట్టణం మరియు పరిసర ప్రాంతాల్లో సుమారు 7 లక్షల మగ్గాలు పనిచేస్తుండగా, ఈ పరిశ్రమ వార్షిక టర్నోవర్ దాదాపు రూ.10 వేల కోట్లు అని తెలిపారు. ప్రతిరోజూ సుమారు 42 మిలియన్ మీటర్ల గ్రే క్లాత్ ఉత్పత్తి అవుతూ దేశవ్యాప్తంగా సరఫరా అవుతోందని పేర్కొన్నారు. అయితే



యుద్ధ ప్రభావంతో ఈ పరిశ్రమ తీవ్రంగా దెబ్బతిందని అన్నారు. పవర్‌లూమ్ యజమాని వల్లాల శ్రీనివాస్ వివరాల ప్రకారం, సింథటిక్ నూలు తయారీలో ఉపయోగించే ముడి చమురు, పెట్రోకెమికల్స్ ధరల పెరుగుదల కారణంగా నూలు ధరలు 25 నుంచి 30 శాతం పెరిగాయి. దీనివల్ల ఉత్పత్తి వ్యయాలు పెరిగి తయారీదారులు నష్టాలను చవిచూస్తున్నారు. మరో యజమాని కొంక మల్లేశం మాట్లాడుతూ, రవాణా ఛార్జీల పెరుగుదల, సరుకు రవాణాలో జాప్యం కూడా నూలు ధరల పెరుగుదలకు కారణమయ్యాయని తెలిపారు. ఉత్పత్తి వ్యయం పెరిగినప్పటికీ, గిరాకీ తగ్గిపోవడంతో తయారైన వస్త్ర ధరలు పెరగలేకపోతున్నాయని, ఇది పరిశ్రమను మరింత సంక్షోభంలోకి నెడుతోందని అన్నారు. జాబ్ వర్క్ ఆధారంగా పరిశ్రమ నడుపుతున్న సిరిపురం తిరుపతి మాట్లాడుతూ, ముందుగానే ఇచ్చిన ఆర్డర్ల ప్రకారం పాత ధరలకే గుడ్డ సరఫరా చేయాల్సి రావడంతో భారీ నష్టాలు వాటిల్లుతున్నాయని తెలిపారు. మొత్తంగా, యుద్ధ ప్రభావంతో పెరిగిన ముడి పదార్థాల ధరలు, తగ్గిన గిరాకీ కలిసి భీవండి పవర్‌లూమ్ పరిశ్రమను కుదేలు చేస్తున్నాయని పరిశ్రమ వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

# ఎన్నికల్లో అవకతవకలు

- ఆంధ్రప్రదేశ్‌లో అర్ధరాత్రి ఓటింగ్‌పై ప్రకాశ్ అంబేద్కర్ సంచలన వ్యాఖ్యలు
- మహారాష్ట్ర ఎన్నికల్లో కూడా మోసం జరిగిందని ఆరోపణ
- మధ్యతరగతి ప్రజలు ఉద్యమానికి రావాలని పిలుపు



**ప్రజానావ, ముంబై:** ఆంధ్రప్రదేశ్ ఎన్నికల్లో అర్ధరాత్రి 11 గంటల నుంచి తెల్లవారుజామున 2 గంటల మధ్య ఏకంగా 5 శాతం ఓటింగ్ నమోదైందని, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో కూడా ఇలాంటి అవకతవకలు జరిగాయని వంచిత్ బహుజన్ అఘాడి అధ్యక్షుడు ప్రకాష్ అంబేద్కర్ ఆరోపించారు. ఈ వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, నిష్పక్షపాతతపై మొదటి నుంచే సందేహాలు వ్యక్తం చేస్తున్న అంబేద్కర్, ఓటింగ్ మరియు లెక్కింపులో అవకతవకలు జరిగాయని పునరుద్ఘాటించారు. శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన తన ఆరోపణలను మరోసారి వెల్లడించారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ భర్త డాక్టర్ ప్రభాకర్ చేసిన విశ్లేషణను ప్రస్తావిస్తూ, 2024 ఆంధ్రప్రదేశ్ ఎన్నికలలో రాత్రి సమయంలో అసాధారణంగా ఓటింగ్ నమోదైందని పేర్కొన్నారు. ఈ అంశం తీవ్రంగా పరిశీలించాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే, మహారాష్ట్రలో పోలింగ్ ముగిసిన తర్వాత సుమారు 76 లక్షల ఓట్లు నమోదయ్యాయని ఆరోపిస్తూ, ఈ విషయంపై చేతన్ అహిరే హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేసినట్లు తెలిపారు. ఓటరు హక్కుల పరిరక్షణ కోసం కోర్టులు స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మధ్యతరగతి ప్రజలు కూడా ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ముందుకు రావాలని అంబేద్కర్ పిలుపునిచ్చారు. దేశం సురక్షితంగా ఉంటేనే కుటుంబాలు సురక్షితంగా ఉంటాయని, ప్రజలు తమ బాధ్యతను గుర్తించి స్పందించాలని కోరారు.




## రాయితీ సిలిండర్ల అక్రమ రీఫిల్లింగ్‌పై ఆకస్మిక తనిఖీలు

- ఐదు సిలిండర్లు, పరికరాలు సీజ్

**ప్రజానావ, కాగజ్‌నగర్:** స్టేట్ టాస్క్ ఫోర్స్ టీం మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు రాజ్‌కుమార్, శ్రీనివాస్, పోచయ్యలు విశ్వసనీయ సమాచారం మేరకు కాగజ్‌నగర్ పట్టణంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో అక్రమ గ్యాస్ రీఫిల్లింగ్ కోసం నిల్వలో ఉన్న 5 డొమెస్టిక్ ఎల్పిజి సిలిండర్లు, డంపింగ్ మెషిన్ సహా పరికరాలు సీజ్ చేశారు. తనిఖీలు స్వాగత్ హోటల్ వెనుక చాపిడి సాయి కుమార్ షెడ్ వద్ద (2 సిలిండర్లు) మరియు న్యూ స్వాగత్ రెస్టారెంట్ వెనుక షెడ్ వద్ద (3 సిలిండర్లు) దొరికాయి. ఈ చర్యలు ఎల్‌పీజీ చట్టాలకు విరుద్ధమని అధికారులు తెలిపారు. బాధ్యులపై కేసు నమోదు చేసి, తదుపరి చట్టపరమైన చర్యలు చేపట్టనున్నారు.

## సింగరేణిలో తక్షణమే మెడికల్ బోర్డు నిర్వహించాలి

- టీబీజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షులు మిర్యాల రాజిరెడ్డి

**ప్రజానావ, మంచిర్యాల:** సింగరేణిలో తక్షణమే మెడికల్ బోర్డు ఏర్పాటు చేయాలని టీబీజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం శ్రీరాంపూర్ ఏరియాలోని ఇందారం ఓసిపి గని పై ఏరియా ఉపాధ్యక్షులు బండి రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు... గత 2024 -25 సంవత్సరంలో 8 మిలియన్ టన్నుల ఉత్పత్తిని అధికంగా చూపెట్టి లాభాలు వచ్చినట్టు ప్రభుత్వం పెద్దలను ప్రసన్నం చేసుకోవడానికి ప్రభుత్వంలోని కొంతమంది సింగరేణి అధికారులు అత్యుత్సాహం చూపెట్టి కాంగ్రెస్ ప్రభుత్వానికి ఆర్థికంగా లబ్ధి చేకూరే విధంగా కృషి చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికులకు లాభాల వాటలో సగానికి తగ్గించి కార్మికులను తీవ్ర ఆర్థిక దోపిడీకి గురిచేసిందన్నారు. ప్రభుత్వం నుండి సింగరేణి సంస్థకు రావాల్సిన రూ. 51 వేల కోట్ల రూపాయలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

## బాలిక వేధింపులను అడ్డుకున్న ఎస్ఆర్పీఎఫ్ ఉద్యోగి హత్య

- నాగ్‌పూర్‌లో దారుణ ఘటన
- ఇద్దరు సోదరుల అరెస్ట్
- కుమార్తెను వేధించిన యువకుడిని హెచ్చరించడంతో వివాదం
- కత్తితో దాడి చేసి హత్య చేసిన నిందితులు



**ప్రజానావ, ముంబై:** నాగ్‌పూర్‌లో బాలికపై జరుగుతున్న లైంగిక వేధింపులను వ్యతిరేకించిన ఎస్ఆర్పీఎఫ్ ఉద్యోగి హత్యకు గురైన ఘటన సంచలనం సృష్టించింది. మృతుడిని పంకజ్ ఠాకూర్‌గా గుర్తించగా, ఈ కేసులో పోలీసులు ఆకాశ్ మండల్, హర్షిత్ మండల్ అనే ఇద్దరు సోదరులను అరెస్టు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం, నిందితుడు ఆకాష్ మండల్ పంకజ్ ఠాకూర్ 15 ఏళ్ల కుమార్తెను కొంతకాలంగా వెంబడిస్తూ వేధిస్తున్నాడు. ఈ విషయం గురించి బాలిక తన తండ్రికి చెప్పడంతో, పంకజ్ ఠాకూర్ అతనిని హెచ్చరించారు. అయినప్పటికీ ఆకాష్ తన ప్రవర్తనను మార్చుకోలేదు. గురువారం హనుమాన్ జయంతి సందర్భంగా జరిగిన అన్నదాన కార్యక్రమంలో మళ్లీ ఈ ఇద్దరూ ఎదురుపడటంతో వివాదం చెలరేగింది. ఆకాష్ బాలికతో మాట్లాడటం చూసిన పంకజ్ ఠాకూర్ కోపంతో వారిని నిలదీశారు. అనంతరం బాలికను ఇంటికి పంపించినా, ఈ ఘర్షణ అక్కడితో ఆగలేదు. కార్యక్రమం ముగిసిన తర్వాత పంకజ్ ఠాకూర్ తన బావమరిది తో కలిసి ఇంటికి వెళ్తుండగా, నిందితులు పాఠశాల సమీపంలో వారిని అడ్డగించారు. మొదట వాగ్వాదం చోటుచేసుకుని, అనంతరం గొడవ తీవ్రరూపం దాల్చింది. ఈ క్రమంలో హర్షిత్ మండల్ కత్తితో పంకజ్ ఠాకూర్‌పై పలు మార్లు దాడి చేశాడు. కిందపడిన తర్వాత కూడా మళ్లీ దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. అతను మృతి చెందినట్లు భావించి నిందితులు అక్కడి నుంచి పారిపోయారు. సమాచారం అందుకున్న ఎంఐడీసీ పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన వ్యక్తిని ఆసుపత్రికి తరలించగా, అప్పటికే పంకజ్ ఠాకూర్ మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు ఆకాష్ మండల్, హర్షిత్ మండల్‌లను అరెస్టు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# గ్రామాల నుంచే ప్రభుత్వ పాలన

- పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్

**ప్రజానావ, ఆసిఫాబాద్:** గ్రామాలనుంచే ప్రభుత్వ పాలన అందిస్తామని తెలంగాణ పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ అన్నాడు. జిల్లాలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా ఆసిఫాబాద్ పట్టణంలోని రోస్ గార్డెన్‌లో జిల్లా కాంగ్రెస్ సర్వసభ్య సమావేశం శుక్రవారం ఘనంగా జరిగింది. సమావేశానికి టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరుకాగా, డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క అధ్యక్షత వహించారు. సమావేశానికి ముందు మహేష్ కుమార్ గౌడ్, ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్‌లకు పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి సుగుణక్క ఘన స్వాగతం పలికి శాలువాలతో సన్మానించారు. అనంతరం కొత్తగా ఎంపికైన జిల్లా కార్యవర్గ సభ్యులకు నియామక పత్రాలను మహేష్ కుమార్ గౌడ్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా చిన్నదైనా రాజకీయంగా ప్రాముఖ్యత కలిగిన జిల్లాగా పేర్కొన్నారు. గతంలో కాంగ్రెస్ పార్టీకి కంచుకోటగా ఉన్న ఈ జిల్లా మళ్లీ అదే దిశగా ముందుకు సాగుతోందన్నారు. ప్రజల సమస్యలను తెలుసుకోవడం, వారికి న్యాయం చేయాలనే లక్ష్యంతో రాహుల్ గాంధీ పాదయాత్ర చేపట్టారని తెలిపారు. అట్టడుగు వర్గాలకు న్యాయం చేసే పార్టీ కాంగ్రెస్ మాత్రమేనని, పార్టీలో 70 శాతం నాయకత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు దక్కిందని పేర్కొన్నారు. గ్రామాల అభివృద్ధి దేశ అభివృద్ధికి మూలమని మహాత్మా గాంధీ చెప్పిన మాటలను గుర్తు చేస్తూ గ్రామీణాభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. దేశంలో దళితులు, గిరిజనులు, వెనుకబడిన వర్గాలకు ఉన్నత పదవులు కల్పించిన పార్టీ కాంగ్రెస్ మాత్రమేనని తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై మాట్లాడుతూ గత ప్రభుత్వ పాలనలో అప్పులు భారీగా పెరిగాయని, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని సమర్థవంతంగా నిర్వహిస్తూ అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగిస్తోందన్నారు. రైతు రుణమాఫీ విషయంలో కూడా కాంగ్రెస్ ప్రభుత్వం పెద్ద ఎత్తున ఉపశమనం కల్పించిందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల వంటి పథకాల ద్వారా ప్రజలకు ప్రయోజనం కలుగుతోందని, ప్రతిపక్ష ఎమ్మెల్యేలు కూడా దీనిని అంగీకరిస్తున్నారని పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ వందకు పైగా స్థానాలు సాధించి తిరిగి అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో అన్ని స్థానాల్లో కాంగ్రెస్ విజయం సాధిస్తుందని అన్నారు. ముఖ్యమంత్రి ఆదిలాబాద్ జిల్లాపై ప్రత్యేక దృష్టి పెట్టారని, భవిష్యత్తులో విమాన సదుపాయం కూడా అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని తెలిపారు.

### ఉపాధికి అవకాశాలు

కుమ్రంభీం జిల్లాలో పరిశ్రమలను ఏర్పాటు చేసి స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ భవిష్యత్తు బలంగా ఉందని, రాబోయే రెండు దశాబ్దాల పాటు అధికారంలో ఉండే స్థాయిలో పార్టీ బలోపేతం అవుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణ మాట్లాడుతూ జిల్లాలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడానికి అన్ని స్థాయిల్లో కృషి చేస్తున్నామని తెలిపారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు పార్టీ నిర్మాణాన్ని మరింత పటిష్ఠం చేస్తున్నామని చెప్పారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో జిల్లాలోని రెండు నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరవేయడం ఖాయమని ధీమా




వ్యక్తం చేశారు. పార్టీ కార్యకర్తలే కాంగ్రెస్‌కు బలమని, వారి కృషితోనే విజయాలు సాధ్యమవుతాయని పేర్కొన్నారు. పార్టీ సిద్ధాంతాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి కాంగ్రెస్ ప్రభుత్వంపై విశ్వాసాన్ని మరింత పెంచుతామని తెలిపారు. సమావేశంలో ఏఐసీసీ కార్యదర్శి ఉమ్మడి జిల్లా ఇన్చార్జి సచిన్ సావంత్, ఎమ్మెల్సీ దండే విఠల్, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, మాజీ డిసిసి అధ్యక్షులు కొక్కిరాల విశ్వప్రసాద్, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి శ్యామ్ నాయక్, గ్రంథాలయ చైర్మన్ అనిల్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఇరుకుల్లా మంగ, ఇందిరా ఫెలోషిప్ జిల్లా అధ్యక్షురాలు కోవ ఇందిరా జిల్లా నాయకులు శంకర్ నాయక్, కొట్రంగే తిరుపతి, సుజాయిత్ ఖాన్, షేక్ మహమ్మద్, మానే సంతోష్, మారుతీ పటేల్, రాథోడ్ సుదర్శన్, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

